క్లుప్తంగా

నేడు సచివాలయం ప్రారంభోత్సవం

కె.గంగవరం: మండలంలోని కూళ్లలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని నేడు ప్రారంభిస్తున్నట్లు ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సచివాలయాన్ని రిబ్బన్ కటింగ్ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మెగా లోక్ అదాలత్

రామచంద్రపురం: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నేడు (శనివారం) రామచంద్రపురం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. కక్షిదారులు అధిక సంఖ్యలో నేడు ఉదయం 10.30 గంటలకు జరిగే నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారులు, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొని అధిక కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు చెల్లూరులో గడప గడపకూ..

రాయవరం: మండలంలోని చెల్లూరు గ్రామంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఎంపీపీ నౌడు వెంకటరమణ శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

రేపు ద్వారపూడిలో ఉచిత కంటి వైద్యశిబిరం

మండపేట: మండలంలోని ద్వారపూడి సొసైటీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే శిబిరాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. రాజమహేంద్రవరంలోని గౌతమి నేత్రాలయం వైద్యులు కంటి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ద్వారపూడి, పరిసర గ్రామాల రైతులు, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు

రాయవరం: మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కొవ్వూరి నాగిరెడ్డిని శుక్రవారం సత్కరించారు. మండలంలోని లొల్ల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాగిరెడ్డి ఇటీవల మండల ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. దీంతో శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఛాత్రాతి జానకి రాంబాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ వీర్రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లంక శ్రీను హాజరయ్యారు. విద్యాభివృద్ధికి నాగిరెడ్డి చేస్తున్న సేవలను వారు కొనియాడారు. అనంతరం నాగిరెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, వీఆర్వో ఆర్ సుబ్బారావు చౌదరి, ఉపాధ్యాయులు జె.రాధాకృష్ణవేణి, ఎం.చంద్రకళ, సుబ్రహ్మణ్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ కుళాయిల సంఖ్యను పెంచాలి

కాజులూరు: గ్రామంలో పబ్లిక్ కుళాయిల సంఖ్యను పెంచేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మంజేరుకు చెందిన గండి వెంకన్న, వెంకటేశ్వరరావు తదితరులు కోరుతున్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పబ్లిక్ కుళాయిలు సరిపడినంతగా లేకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా శివారు గ్రామాలైన ఎస్సీపేట, నక్కతిప్పపాలెంలలో నీట ఎద్దడి మరింత ఎక్కువగా ఉందన్నారు. గ్రామంలో గతంలో అక్కడక్కడా ఉండే చేతిపంపులు, మంచినీటి బావులు శిథిలమయ్యాయని ప్రస్తుతం ప్రజలకు పైపులైను ద్వారా కుళాయిల నుంచి వచ్చే తాగునీరు తప్ప మరో ప్రత్యామ్నాయ అవకాశం లేదన్నారు. పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

పాలతోడు.. ప్రగతి చూడు

- దీర్ఘకాలం నాటి సమస్యలు పరిష్కారం
- రెండేళ్లలో రూ.1.36 కోట్ల అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



బీసీ ఏరియాలో నిర్మించిన సీసీ రోడ్డు



కాలనీలో కాలువపై నిర్మించిన కల్వర్టు

మండపేట: దీర్ఘకాలంగా గ్రామాన్ని పట్టిపీడిస్తున్న పలు సమస్యలకు చరమగీతం పాడుతూ పాలతోడులో అభివృద్ధి జోరందుకుంది. పంచాయతీ కొత్త పాలకవర్గం వచ్చిన గత రెండేళ్లలో రూ.1.16 కోట్లు అభివృద్ధి పనులు జరుగ్గా, తాజాగా సీసీ డ్రైన్లు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

మండలంలోని పాలతోడు మైనర్ పంచాయతీ. గ్రామ జనాభా 2,700 కాగా 1,890 మంది వరకు ఓటర్లు ఉన్నారు. అధ్వానంగా తయారైన రోడ్లు, డ్రైన్లతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇందిరమ్మ కాలనీలో కనీస వసతులు కరువై కాలనీవాసులు దుర్భర జీవనం సాగించేవారు. కాలనీకి వెళ్లే కాలువగట్టు జిగురుమట్టితో కొద్దిపాటి చినుకులకు ప్రమాదకరంగా తయారయ్యేది. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పొలాల మీదుగా శ్మశానవాటికకు వెళ్లే పుంత రోడ్డు పెద్దపెద్ద గోతులతో రాకపోకలు సాగించేందుకు రైతులు అగచాట్లు పడాల్సి వచ్చేది.

అభివృద్ధికి బాటలు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు. ఇందిరమ్మ కాలనీవాసుల వెతలను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. రూ.20 లక్షలతో కాలనీకి వెళ్లే కాలువగట్టు రోడ్డును అప్రోచ్‌రోడ్డుగా, కాలనీలో అంతర్గత రోడ్లను మెటల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. రూ.8 లక్షలతో పంట బోదెపై రెండు కల్వర్టులు నిర్మించారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతి వీధిలో విద్యుత్‌లైన్లు, లో ఓల్టేజీ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.13 లక్షలతో వాటర్ పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలు పంపారు, అలాగే డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది నాయకులు, అధికారులను వేడుకున్నా జరగని అభివృద్ధి కేవలం నెలల వ్యవధిలో జరగడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రూ.33.36 లక్షలతో శ్మశాన వాటిక రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. బీసీ, ఎస్సీ ఏరియాల్లో రూ.25 లక్షలతో సచివాలయ నిర్మాణం చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు.

నేడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

గ్రామంలోని ఆయా అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్లకు భూమిపూజ చేస్తారని సర్పంచ్ వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు తెలిపారు.

ఎమ్మెల్సీ తోట సహకారంతో..



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నాం. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఆయన దృష్టికి తీసుకువెళితే వెంటనే స్పందిస్తున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు.

– పిల్లా వెంకటలక్ష్మి, సర్పంచ్, పాలతోడు

మా వెతలు తీర్చారు



ఎన్నో ఏళ్లుగా కాలనీలో కనీస వసతులు లేక దుర్భర జీవనం సాగించాం. జిగురుమట్టితో వర్షాకాలంలో నడవలేని పరిస్థితి ఉండేది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వచ్చాక కాలనీలో రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి మా వెతలు తీర్చారు.

– దాసరి సుబ్బలక్ష్మి, కాలనీవాసి, పాలతోడు

ఓదూరులో ఆలయానికి శంకుస్థాపన



ఓదూరులో గోగులమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరులో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వింజమళ్ల విమలకుమారి, ఉప సర్పంచ్ కొండేపూడి ప్రసన్న, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు కొండేపూడి శ్రీనివాస జానకిరామయ్య, కొండేపూడి నారాయణరావు, చింతపల్లి శ్రీరామసత్యనారాయణ, ఎంపీటీసీ రెడ్డం సతీష్, నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, చిక్కాల దొరబాబు, పోలిశెట్టి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసిన మంత్రి వేణుకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న సంఘ నాయకులు

- పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: స్వర్ణకారులకు ఆపద ఎదురైతే వారికి అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నామన్నారు. మండపేట బంగారం, వెండి వర్తకుల సంఘం ఆధ్వర్యంలో వ్యాపారులు, స్వర్ణకారులు శుక్రవారం రాత్రి స్థానిక బంగారం కొట్ల వీధిలో ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. ఆ సంఘాధ్యక్షుడు జొన్నల బాబి అధ్యక్షతన జరిగిన వేడుకకు వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఏ వ్యాపారం అయినా నమ్మకంపై ఆధారపడి ఉంటుందని, బంగారం వ్యాపారానికి మండపేటకు మంచి పేరుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రింగ్ రోడ్ తీసుకు వచ్చే ఆలోచన ఉందన్నారు. నాలుగు దశాబ్దాలుగా పారిశుధ్య నిర్వహణను సవాల్ చేస్తూ పట్టణాన్ని పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించామన్నారు. నాలుగైదు రోజుల్లో స్థల సేకరణ ప్రక్రియ పూర్తి కానుందని చెప్పారు. అందుకు సహకరించిన సంకా, జొన్నల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ తోట కృతజ్ఞతలు తెలిపారు. పట్టాభిరామయ్య చౌదరి, రాజుబాబు, పలువురు స్వర్ణకార సంఘం నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే చేరవేస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్సీ తోట నాయత్వంలో వైఎస్సార్ సీపీ విజయానికి పని చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ తోటను బంగారం, వెండి వర్తక సంఘం ఘనంగా సత్కరించింది. జిన్నూరి సాయిబాబా, సంఘ నాయకులు కొమ్ము రాంబాబు, మహంతి అసిరినాయుడు, జొన్నల భాస్కరరావు, సంకా బాబ్జి, పేరపు భాస్కరరావు, సంకా శ్రీనివాసరంగా, గడి రాంబాబు, మణ్యం మహేష్, నరిగిరి కృష్ణ, అడపా వాసు, కీర్తి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణశోభ



గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కాజులూరు: శ్రావణమాసం వచ్చిందంటే చాలు అమ్మవారి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంటాయి. ప్రధానంగా శ్రావణ పౌర్ణమి ముందుగా వచ్చే శుక్రవారం వరలక్ష్మి అమ్మవారి వ్రతాన్ని మహిళలు ప్రత్యేకంగా ఆచరిస్తారు. దాంతో పాటుగా శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలను మహిళలు పుణ్యదినాలుగానే భావిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం కాజులూరు మండల గ్రామాల్లో పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.

పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. నాలుగో శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పీఠానికి విచ్చేసి సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. తొలుత పీఠంలోని విజయదుర్గ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. సామూహిక పూజల అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు అందుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు విజయదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో బాబీ, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, సత్య కనకదుర్గ, రమ పాల్గొన్నారు.

సురక్ష సర్వేను విజయవంతం చేయండి



ద్రాక్షారామ పీహెచ్‌సీలో సిబ్బందిని వివరాలు అడుగుతున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

రామచంద్రపురం రూరల్: త్వరలో ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వేను విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర సిబ్బందికి సూచించారు. మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, ఇతర రోగులకు అందుతున్న వైద్య సేవలు, లేబొరేటరీ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మధుమేహ, రక్తపోటు వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వారికి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ప్రశాంతి, సందీప్ నాయుడు, ఎంపీహెచ్ఓ రామకృష్ణ, సీహెచ్ఓ వీరవేణి, ఎంపీహెచ్ఎస్ గంగాధర్, పీహెచ్ఎన్ సుబ్బలక్ష్మి, స్టాఫ్‌నర్సు సుధ, ల్యాబ్ టెక్నీషియన్ మాణిక్యాంబ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

కొత్తపేట: 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకంపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వానపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ఎస్‌బీ హర్ష మాట్లాడుతూ పథకం గురించి వివరించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ పథకం విజయవంతంగా కొనసాగుతుందని హర్ష తెలిపారు. ఇప్పుడు గ్రామంలోనే ఉన్నత వైద్య సేవలందించేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం అమలు చేస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఇద్దరు వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందిస్తుండగా ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకంలో స్థానిక వైద్యులు ఇద్దరితో పాటు అదనంగా మరో ఇద్దరు వివిధ వ్యాధుల స్పెషలిస్టులు కూడా ఉంటారని హర్ష తెలిపారు. ఈ పథకం కింద మొదట ఈ నెల 15న వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించగా 16 నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు నిర్వహించి 7 రకాల టెస్టులు చేస్తారన్నారు. వ్యాధి పరిస్థితిని బట్టి తాత్కాలిక చికిత్స అందిస్తారన్నారు. అత్యవసరమైతే ఉన్నత వైద్యానికి సిఫారసు చేస్తారన్నారు. ఈ శిబిరంలో 103 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యపావని, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై ఎంపీడీఓ నాతిబుజ్జి అవగాహన కల్పించారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు అన్ని సచివాలయాల వద్ద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం

మామిడికుదురు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామని జిల్లా పరిషత్ సీఈఓ, పి.గన్నవరం నియోజకవర్గ ఈఆర్వో ఎ.రమణారెడ్డి పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులతో ఓటర్ల జాబితాపై చర్చించారు. కొత్త ఓట్ల నమోదు, అనర్హులను జాబితా నుంచి తొలగించడం తదితర అంశాలపై మాట్లా డారు. రమణారెడ్డి మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు పి.గన్నవరం మండల రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా దీనిపై ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయం చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీల నేతల అభిప్రాయాలను తీసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని రమణారెడ్డి తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబాజీపేట: తొలగించిన ప్రతి ఓటు డాక్యుమెంట్‌ను నూరు శాతం పునఃపరిశీలన చేయాలని బీఎల్వోలకు ఆదేశించామని ఈఆర్వో రమణారెడ్డి తెలిపారు. అంబాజీపేటలో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన శుక్రవారం సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఇంటింటా సర్వే పూర్తి చేశామని, కొత్త ఓటర్లకు అవకాశం, చేర్పులు, మార్పుల ప్రక్రియలను పక్కాగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు, బీఎల్వోలు ఆయన వెంట ఉన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో విద్యార్థులు

మండపేట: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని సంఘం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ మాట్లాడుతూ సంప్రదాయకంగా భాషను ఉపయోగించేందుకు అవసరమైన చదవటం, రాయడం, వినడం, మాట్లాడడం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవటాన్నే అక్షరాస్యత అంటారన్నారు. అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరికీ విద్య, విజ్ఞానం ఎంతో అవసరమని వివరించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని నినదిస్తూ విద్యార్థులు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

కె.గంగవరం: మండలంలోని అండర్ 14, 17 బాలబాలికల స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎంఈఓలు నాగరాజు, ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించబడతాయని విద్యార్థులు ఏ క్రీడల్లో ఏ ఏ గ్రూపుల్లో పోటీలు నిర్వహిస్తారో దానికి సంబంధించిన ఎంట్రీ ఫామ్‌లో నమోదు చేసి అందించాలని కోరారు. ఈ పోటీలు పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని ఎంపిక పోటీలు కూడా ఇదే పాఠశాలలో ఉంటాయని చెప్పారు.

ఆర్అండ్‌బీ రహదారి పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న జేసీ నూపుర్ అజయ్

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి నుంచి కె.జగన్నాథపురం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు సమస్యపై గత సోమవారం గ్రామానికి చెందిన కొంకి వెంకట్రావు తదితరులు కలసి కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, ఆర్అండ్‌బీ ఈఈ, జేఈ, శుక్రవారం రోడ్డు పరిశీలించారు. మూడు రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. జేసీ వెంట తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి

కొత్తపేట: కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించి ఆ రైతులను ఆదుకోవాలని కొత్తపేట మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ అధ్యక్షత ఏఏబీ సమావేశం జరిగింది. ఏఏబీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో గత కొన్నేళ్లుగా కొబ్బరికి వివిధ తెగుళ్ల వ్యాపించి దిగుబడి తగ్గిపోయిందని, దానికను గుణంగానే ధర కూడా తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో మద్దతు ధర ప్రకటించే విషయాన్ని ఉన్నతాధికారులు ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని చైర్మన్, సభ్యుడు కోరారు. అరటి పంటకు సంబంధించి చెట్లకు ఊతంగా వెదురు గెడలను రాయితీపై సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 15 నాటికి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని రైతులను ఏఓ కోరారు. పురుగుమందులు, నానో ఎరువుల పిచికారీలో కూలీల కొరత అధిగమించేందుకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు సమకూరుస్తుందన్నా రు. తొలుతగా అవిడి, కొత్తపేట, పలివెల గ్రామా ల్లో రైతు గ్రూపులను ఎంపిక చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఏఏబీ సభ్యుడు ఎంకే సుబ్రహ్మణ్యం వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పలువురిపై దాడి కేసు

అయినవిల్లి: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న వ్యక్తిని గాయపర్చిన వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం సిరిపల్లిలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టు కొట్టు సంబరం నిర్వహిస్తున్న సందర్భంగా డ్యాన్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఉత్సవంగా నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన నక్కా మోహన్‌రావు సెల్‌ఫోన్‌లో డ్యాన్స్ వీడియో చిత్రీకరిస్తుండగా ఉత్సవం వద్ద పలువురు అతడిని వీడియో తీస్తున్నావు ఏమిటిరా అని అతనిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై మోహనరావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

అయినవిల్లి: గ్రామంలోని మత్స్యకార కాలనీలో అంగరంగ వైభవంగా సీతారాములు ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ శ్రీరామచంద్రమూర్తి, అయినవిల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కుడుపూడి శేఖర్, ఉపాధ్యక్షుడు పసర్లపూడి శ్రీనివాస్, గ్రామ సంఘ నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలి



ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావుకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు, నాయకులు

మలికిపురం: మలికిపురంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను పూర్తిగా ప్రభుత్వం పరం చేసే వరకు ఉద్యమిస్తామని ఈరోజు ఆ విద్యాసంస్థల పరిరక్షణ సమితి ప్రతిజ్ఞ చేసింది. శుక్రవారం సమితి ఆధ్వర్యంలో మలికిపురం నుంచి కత్తిమండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. న్యాయం జరిగే వరకూ పోరాడతామని అని విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రాజోలు శాసనసభ్యులు రాపాక వరప్రసాదరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. విద్యాసంస్థల పరిరక్షణ సమితి నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, తాడి రవీంద్ర, నక్క సంజయ్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, శశి, ఐశ్వర్య, జ్యోతి తదితరులు నాయకత్వం వహించారు.